జ్యోతి కథల పోటీలో ప్రత్యేక ప్రశంసపొందిన కథ!

వి. రాజారామమోహనరావు

ఆడమనసు

చెట్ల ఆకులు చివరివరకు నెమ్మదిగా నడచి గబుక్కున కిందకి దూకుతున్నాయి వర్షం చినుకులు. సాయంత్రం మరీ పూర్తిగా చీకటయిపోలేదు. వరండా చివరి దాకా వచ్చి తలెత్తి ఆకాశాన్ని చూసింది సావిత్రి.

మబ్బుల్ని చూస్తూ "రాత్రికి బాగా వానొస్తుందన్నమాట." అనుకుంది. లోపల గదిలోకొచ్చి కిటికీ దగ్గర నిలబడింది.

మబ్బుపట్టి మసకమసగ్గా వుండే సాయంత్రాలన్నా, వర్షం కురిసే రాత్రులన్నా చిరాగ్గా వుంటోంది ముప్పయి రెండేళ్ళ సావిత్రికి. ఇదే కాదు ఏ విషయంలో చిరాకు కలిగినా దాన్నించి తప్పించుకోవాలని, ఏదో రకంగా జీవితాన్ని అందంగా, ఆనందంగా మార్చుకోవాలని తెగ తాపత్రయ పడుతోంది.

చీకటి మింగేస్తున్న సాయంత్రంలోనూ. మబ్బులుపట్టి ముంచుకొస్తున్న వర్షానికి తల లొంచుకుని నెమ్మదిగా అటూ ఇటూ వూగుతున్న చెట్లలోనూ ఎంత ప్రయత్నించినా ఏ అందం, ఆనందం కన్పించలేదు సావిత్రికి.

చినుకులకి గాలి తోడయింది. కిటికీ వేసేద్దామా అనుకుంది. కానీ అంత తొందరగా తలుపులు మూసేసుకుని, ఆ వంటరి ఇంట్లో తనని తను అప్పుడే బంధించుకోవాలనిపించలేదు.

తిరిగి వీధివేపువచ్చి గుమ్మం దగ్గర కూర్చుంది. ఆ వీధి అసలే చిన్నది. అందులో వూరికి ఓ మూలగావుంది. వీధిలో ఇళ్ళన్నీ ఒకవేపే వున్నాయి. ఎదురుగా చెట్టూచేమా తప్ప ఇంకేంలేవు. కాసేపు వాటినే చూసింది, చూసిచూసి కాస్త మనుషులు తిరిగే వీధయినా బాగుణ్ణు అనుకుంది.

కొన్నాళ్ళ క్రితంవరకు ఎవరైనా తన ఇంటికి వచ్చారంటే భయపడేది సావిత్రి. వాళ్ళుతీసే ఆరాలు, ఎదుటి వాళ్ళను బాధపెట్టడానికే పని కొచ్చేవాళ్ళ ప్రశ్నలు, వెటకారాలు చాలా ఇబ్బందిగా వుండేవి.

నాలుగైదేళ్ళుగా ఎవరొచ్చి ఏదడిగినా ఒకేలా వుంటోంది సావిత్రికి. వాళ్ళడిగేవి అలాగే వుంటున్నాయి.

'మీ ఆయన ఎక్కడున్నాడు? ఏం చేస్తున్నాడు? ఎప్పుడొస్తారు? ఒంటరిగా ఒక్కదానివి ఈ పల్లెటూళ్లో, ఈ పంతులమ్మ ఉద్యోగం చెయ్యకపోతేనేం? మీ వాళ్లెవరూలేరా?''

కొత్తలో చాలాచోట్ల నిజం చెప్పింది. భర్త తనను వదిలేశాడనీ—తనకెవరూలేరనీ అందువల్లే ఇలా వంటరిగా ఉద్యోగం చేసుకుంటున్నాననీ కానీ దానివల్ల ప్రయోజనం కన్న ఇబ్బందులే ఎక్కువయ్యాయి.

మొగుడిని వదిలేసి వంటరిగా కులుకుతోందని కొందరు.. వంటరిగా వున్న ఆడదానివి నిన్నుద్ధరిస్తాం మాతో కులకమని కొందరూ ఇలా రకరకాల మనుషులు పీక్కు తింటం ఎక్కువయింది.

అందుకే ఈ ఊరువస్తూనే కొన్ని అందమైన అబద్ధాలు కూడా తెచ్చుకుంది. ముఖానికి, మనసుకీ, మాటతీరుకీ కొన్ని నకిలీ రంగుల్ని పూసుకొచ్చింది.

ఇదివరకటి ఊళ్ళల్లోకన్నా ఈ ఊళ్ళో బతుకు కొంచెం బాగుంది సావిత్రికి. భర్త విదేశాల్లో ఉన్నాడనీ, తనకు చాలామంది బంధువులున్నా పల్లెటూళ్ళమీదా, పసిపిల్లకి చదువు చెప్పటం మీదున్న ఇష్టంవల్ల ఇలా ఉద్యోగం చేస్తున్నానని చెపుతూ వచ్చింది. తనని గురించి అడిగిన వాళ్ళందరికీ—రకరకాల వివరాలతో పై అబద్ధాన్ని నవ్వుతూ, అందంగా, విసుగు లేకుండా చెప్పటం అలవాటు చేసుకుంది.

దానితో కొన్ని విషయాల్లో నిజంకన్నా అబద్ధాలకే జనం ఎక్కువ విలువిస్తారనీ, పరోక్షంగా వాటిని ప్రోత్సహిస్తారనే తెలిసింది సావిత్రికి.

అబద్ధాలవల్లయినా తన చుట్టూ వాతావరణంలోమార్పువచ్చేటప్పటికి ధైర్యం వచ్చింది సావిత్రికి. అ సమానం ఏదో నరకంలో ఏడిపించుకు తినే హెడ్మాస్టరుని డబ్బు, పలుకుబడి గల పల్లె ప్రముఖులు పన్నే వుచ్చుల్ని ధైర్యంగా ఎదిరించ గలుగుతోంది. నిజానికి, ఈ ఉద్యోగమే తన జీవనాధారమైనా, ఉద్యోగమంటే లెక్కలేనట్టు. ఆ ఊర్నుంచి బదిలీ చేస్తే సరదాగా మరో కొత్త ఊరు చూస్తానన్నట్టు ప్రవర్తించటంతో బయటి ఇబ్బందులు చాలావరకు తగ్గాయి.

ఇప్పుడు మనుషులన్నా, ఎవరితోనైనా మాట్లాడాలన్నా చాలావరకు భయం తగ్గింది. అయినా ముభావంగా ఉండే అలవాటుపోలేదు. ఎదుటి వాళ్ళగురించి ఎక్కువ పట్టించుకోకూడదన్న ధోరణి పోలేదు.

ఈ వొంటరి తనంలో ఈ వర్షపు చీకట్లో ఆప్యాయంగా చేరువగా కబుర్లు చేప్పే మనిషి ఎవరన్నా వస్తే బావుండు ననిపించింది సావిత్రికి, ఎవరూ రారని తెలుసు. అయినా ఆ నిజం వొప్పుకుని మనసుని మరింత బాధపెట్టుకోవాలనిపించలేదు. ఇలాగే చాలా నిజాల్ని దూరంగా తోసేస్తూ, అబద్ధాలకి దగ్గిరవుతూ మొండిగా గడుపుతున్నా కొన్ని కొన్ని సావిత్రిని మామూలుగా వుండనివ్వటంలేదు.

సూర్యోదయంలో పూర్తిగా విచ్చుకొని కని

రచయితను గురించి



పుట్టింది 1946 లో.

ఇప్పటికి పందపైగా కథలు నాలుగు నవలలు వివిధ పత్రికలలో అచ్చు అయ్యాయి. 'వరద' కథల సంపుటిని ఎమెస్కోవారు వెలువరించాయి. కన్నడ, హిందీ, తమిళ, మళయాళ భాషల్లోకి పది పైగా కథలు అనువాదం అయ్యాయి. 1977 స్వాతి కథల పోటీలో రెండవ బహుమతి. నవభారత్ బుక్‌హౌస్ వారి నవలా ప్రియదర్శిని బేలట్ పోటీలో 'కొత్త చిగురు' నవలకి బహుమతి, 'జ్యోతి' ప్రత్యేక పారితోషికాల పథకంలో మూడవ బహుమతి వచ్చాయి.

తెలుగులో సాహిత్యానికి వ్యాపారపు రంగు ఎక్కువై పోతున్న సమయంలో "జ్యోతి" కొత్తకొత్త పథకాలతో మంచి కథలకోసం చేస్తున్న కృషికి సంతోషం.

—వి. రాజారామమోహనరావు

పించే పువ్వుల్ని చూసినా, పకపకలాడే పసి పిల్లల్ని చూసినా, దగ్గరగావుండే పక్షుల్ని చూసినా, మంచుకురిసే పుదయాన్ని చూసినా, సావిత్రి మనసు మామూలుగా వుండటంలేదు. దుడుకు వూహలు, పిచ్చి ఆశలు మేమూ వున్నామంటున్నాయి మనసులోంచి.

ఎవరైనా సావిత్రి అనటానికి బదులు 'సావిత్రమ్మా' అని పిలిస్తే వయసు గుర్తొస్తోంది. వొంటరిగా జీవితం ఇంక ఇంతేనా అనిపిస్తోంది. కూచున్న చోటుని, బయటి వాతావరణాన్ని, ఇంటిని చూస్తుంటే సరిగ్గా సావిత్రికి ఇప్పుడలాగే అన్పించింది.

వొదిలేసిన భర్త తిరిగి తన జీవితంలోకి వస్తాడన్న ఆశ చాలా తక్కువే. ఇంకే ఇతర బాధ్యతలు ఎలాగాలేవు పూనుకుని తన జీవితానికి ఏదో దారిచూసే పెద్ద దిక్కులేదు, ఇంకేదేనా చేస్తే తనే చేయాలి.

ఏదేనా చేయాలనే ఉద్దేశ్యం ఆలోచనల్లోనే వుండిపోతోంది. చేతలవరకూ రావటంలేదు. మనసుని నొక్కిపెడుతూ ఏమిటో తెలియని బరువు ఆ బరువునించి బయటపడి స్వేచ్ఛగా వూపిరి పీల్చాలని వుంది సావిత్రికి.

గుమ్మంలో అంత విశాలంగా కూర్చున్నా, చల్లటిగాలేస్తున్నా .ఏదో ఇరుకుగా వున్నట్టు, వూపిరాడకుండా వుక్కిరి బిక్కిరిగా వున్నట్టు అనిపించింది సావిత్రికి. ఇంక అక్కడ కూచోవాలనిపించలేదు.

లేచి వీధి తలుపు వేసేసి వెనక్కి తిరిగింది. ఇల్లంతా ఏదో అడవిలో వుండే గుహలా కనపడింది. కిటికీవేపు తిరిగి మడత మంచంమీద వోరగా పడుకుంది.

బయట పెరిగిన వర్షం చప్పుడు తెలుస్తూనే వుంది.

అలా పడుకుంటే .చిన్నతనంలో చేతులు బార్లా చాపి వర్షంలో తడిసిన రోజులు పెళ్ళయిన కొత్తల్లో భర్తతో కలిసి గడిపిన కొన్ని చలి రాత్రుళ్ళూ. ఒక్కొక్కటే పాత జీవితపు జ్ఞాపకాలు రావటం మొదలెట్టాయి.

అదొక రకం మత్తని తెలుసు సావిత్రి జ్ఞాపకాల రూపంలో ఆ మత్తు అలా నెమ్మదిగా మెదడంతా పాకి, బలపడి తల దిమ్మెక్కేలా చేస్తుంది. అర్థంకాని దిగులు, నిరాశ, నిరుత్సాహంలోకి అదో విచిత్ర ప్రయాణం.

చాలాసేపు అలాగే మత్తుగా పడుకుని, సావిత్రి తిరిగి లేచేటప్పటికి వర్షం మరింత పెరిగింది. రాత్రి మరింత ముందుకు నడిచింది.

టైము పదవుతుండటం చూసి 'ఇంక అన్నం తినేసి పడుకుంటే సరి' అనుకుంది.

ఆకలిగా లేకపోయినా, అన్నం తినాలని అంతగా అనిపించకపోయినా, నెమ్మదిగాలేచి వంటింటి వేపు నడిచింది. కంచం, గిన్నెలు.. పీట పక్కనే వున్నాయి. పీట కొంచెం వెనక్కి లాక్కుని కూచుంది. కంచంతో అన్నం పెట్టుకోబోతుంటే చప్పుడయింది. రెండో సారిగ్గానీ వీధి తలుపు చప్పుడని నిర్ధారణ చేసుకోలేక పోయింది. సావిత్రి వెళ్ళి తలుపు తీసేలోపల మరో రెండుసార్లు విని పడింది తలుపు చప్పుడు.

తడిసిపోయి నీటి ముద్దలా వున్నాడు. గుమ్మంలో మనిషి తలుపు తీసిన సావిత్రిని చూసి మాట రానట్టు అలానేవుండి పోయాడు.

కాసేపు చూసి సావిత్రే అడిగింది "ఎవరు కావాలండీ?" అని.

ఒకసారి తల తిప్పి వీధిని, ఇంటి వరండానీ పరికించి చూశాడాయన. చూసి "భూషణం లేడాండీ?" అన్నాడు.

"ఏ భూషణం అండీ?" అంది సావిత్రి అర్థంకాక.

"ఇక్కడ జిల్లా పరిషత్తు స్కూల్లో లెక్కల టీచరు నాగభూషణం" అన్నాడాయన కొంచెం తడబడుతూ.

"ఎవరూ లేరండీ! నేను ఒక్కదాన్నే వుంటున్నాను." అందామనుకుంది సావిత్రి.

కురుస్తున్న వర్షంలోంచి పొడి స్థలంలోకి రానటం వల్లే మో గుమ్మంలో ఆయన వణుకుతున్నాడు. దవడలు కొట్టుకుంటున్నాయి.

ఆయన్ని ఆ స్థితిలో చూసి "ముందు లోప

లికి రండి." అంది రెండడుగులు లోపలికి వేస్తూ సావిత్రి.

"అబ్బే పర్వాలేదండీ భూష ణ " అన్నాడాయన తిరిగి.

తనకు ముందు ఆ యింట్లో భూషణం అన్నాయన వుండేవాడని ఆయన ఖాళీచేసిన వారం రోజులకే తను ఈ వూరు రావటం, ఈ ఇంట్లో దిగటం గుర్తొచ్చింది సావిత్రికి!

గుమ్మంలో ఆయనింకా లోపలికి రాకపోవటం చూసి "ముందు లోపలికి రండి చలి." అంది సావిత్రి తిరిగి.

ఆయన లోపలికొచ్చి గుమ్మం పక్కగా నిలబడ్డాడు! సావిత్రి దండెంమీంచి తువ్వాలు తీసిచ్చింది ముందు తుడుచుకోమన్నట్టు చూస్తూ.

తువ్వాలందుపని తల తుడుచుకుంటూ, గది నాలుగు వేపులా అయోమయంగా చూసాడాయన భూషణం కోసం వెతుకుతున్నట్టు.



"భూషణం గారికి ఈ వూరునించి ట్రాన్సఫరయిందండీ. ఆయ నెళ్ళాకే నే నీ ఇంట్లోకి వచ్చాను. ఆయన్ని నేను ఎరగక పోవటం వల్ల మీరు అడిగిన వెంటనే గుర్తురాలేదు" అంది సావిత్రి.

"ట్రాన్సఫరయి వెళ్ళిపోయాడా?" అన్నాడాయన ఆశ్చర్యంగా తుడుచుకుంటున్న తువ్వాల్ని ముఖం మీంచి తీస్తూ.

అవునన్నట్టు తలూపింది సావిత్రి.

"ఎ వూరు బదిలీ అయిందో తెలుసా?" అన్నాడాయన.

తెలియదని, తెల్లారి స్కూల్లో అడిగితే తెలియొచ్చని చెప్పింది సావిత్రి.

తువ్వాలు తిరిగి యిస్తుంటే చూసిందాయన ముఖం సావిత్రి. కొద్దిగా గడ్డం మాసింది. ముప్ఫయి అయిదు. నలభై వుంటుంది వయసు అనుకుంది? సహజంగా ఆ వయసులో వుండాల్సినంత వెలుగు, మెరుపు ఆ ముఖంలో కన్పించలేదు సావిత్రికి. ఏదో దిగులు ఆవరించు కున్నట్టున్నాయి ఆయన ముఖం, కళ్ళు.

తన మానసిక పరిస్థితినిబట్టి కేవలం అది తన వూహేమో అనుకుంది. లేదా ఆయన ఆ వూరు వచ్చిన పని అవక తవకగా తయారయినందుకు అలా వున్నాడేమో అనుకుంది.

"థాంక్సండీ! ఇంక నేను వెళ్తాను" అన్నాడాయన సావిత్రివేపు చూస్తూ.

"అలాగే" అని తలూపబోతూ బయటికి చూసింది సావిత్రి. విపరీతంగా కురుస్తోంది వర్షం. ఇందాకటంత కాకపోయినా ఆయ నింకా కొద్దిగా వణుకుతూనే వున్నాడు.

"ఈ వర్షంలో ఎలా అసలింతకీ మీరు

" అంటూ ఆపేసింది సావిత్రి.

"నేను నాగభూషణం స్నేహితులమండీ! ఇదివరకు తరచుగా వస్తుండే వాడిని. గత ఏడాదిగా నా భార్యకు సుస్తీ చేయటం, వైద్యం కోసం వూళ్ళు తిరగటం, చివరికి ఆవిడ పోవటం వీటివల్ల ఈ మధ్యలో రాలేదు. తిన్నగా ఇంటి పట్టున వుండక పోవటంవల్ల భూషణం బదిలీ గురించి తెలియలేదు . వాడు రానే వుంటాడు" అన్నాడు.

"ఇంతకీ మీరిప్పుడు ఎక్కడికెళ్ళాలి?" అంది సావిత్రి,

"తిరిగి ఏలూరు వెళ్ళిపోవాలండీ? అక్కడ్నించే వచ్చాను" అన్నాడాయన.

ఏలూరు వెళ్ళటానికి తెల్లారితేగానీ బస్సు ల్లేవని తెలుసు సావిత్రికి. ఎలా వెళతారనీ అడగాలని ఆయనవేపు చూసింది.

బయటికి వర్షంలోకిచూస్తూ నిలబడ్డాడాయన.

ఇందాకటికన్నా నీరసంగా కనిపించింది. ఆయన ముఖం సావిత్రికి.

"ఇప్పుడెలా వెళ్తారు? బస్సులేంవుండవు." అంది.

"అదే ఆలోచిస్తున్నాను." అన్నాడాయన చిన్న పిల్లాడిలా ముఖంపెట్టి.

"మరీ అంత దిగులు పడకండి! మీ స్నేహితుణ్ణయితే తీసుకు రాలేను కానీ తెల్లారేవరకు ఆతిథ్యం ఇవ్వగలను." అంది సావిత్రి నెమ్మదిగా నవ్వుతూ.

"అబ్బే దిగులు కాదండీ, వాణ్ణి చూద్దామని ఎంతో ఆశగా వచ్చాను. నా భార్య పోయిన సంగతి వాడితో చెప్పుకోవాలనుకున్నాను. ఏదైనా చెప్పుకోడానికి నాకు మిగిలిన ఆత్మీయుడు వాడొక్కడే!" అన్నాడు.

వెంటనే ఏం మాట్లాడ్లేకపోయింది సావిత్రి.

కనీసం మీకు అతనయినా వున్నాడు! అని అందామని నోటి దాకా వచ్చింది. కానీ మాట నోరు దాటకుండా జాగర్త పడింది.

ఓ క్షణం గడిచాక "వీధి తలుపు దగ్గరగా వేసి లోపలికి రండి!" అంది తువ్వాలు తిరిగి యిస్తూ.

తువ్వాలు తీసుకుని వీధి తలుపు దగ్గరగా వేశాడు తప్ప లోపలికి రాలేదాయన.

"ఏం?" అన్నట్టు చూసింది సావిత్రి.

తలొంచి కాళ్ళవేపు చూశాడు, కింద చిన్న మడుగులా తయారయింది.

అదిచూసి నవ్వుతూ "ఏం పర్వాలేదు రండి!" అంది సావిత్రి ముందుకు నడుస్తూ.

"మీ కెందుకండీ శ్రమ? కొంచెం వర్షం వెలిశాక వెళ్ళిపోతాను. ఏ లారీయేనా దొరుకుతుందేమో చూస్తాను" అన్నాడాయన.

"శ్రమేవుంది! వర్షం వెలిస్తే అలాగే వెళ్దురుగాని! వూరికే మొహమాట పడకండి!" అంది.

తువ్వాలుతో చేతులు తుడుచుకుంటూ ఓ అడుగు ముందుకు వేశాడు.

గది నాలుగు వేపులా చూస్తూ "మీరు వొంటరిగా వుంటున్నట్టున్నారు?" అన్నాడాయన.

నడుస్తున్నదల్లా ఆగిపోయింది సావిత్రి. అంతవరకూ స్వచ్ఛంగావున్న తనలోకి కొంచెం నకిలీ తనం తెచ్చుకుని "మావారు——" అంటూ మొదలెట్టింది.

"అబ్బే వివరాలకోసం కాదండీ! ఇంట్లో మీరు తప్ప మరెవరూ కన్పించకపోతే అలా అన్నాను" అన్నాడాయన.

అనుకోకుండానే సావిత్రి మనసెంతో తేలిక పడింది. ఓసారి ఆయనవేపు తలతిప్పి చూసి మళ్ళీ ముందుకు నడిచింది.

ఆయన తడిబట్టలు మార్చుకోడానికి ఏమివ్వాలో తెలియక కాసేపు తడివిట్లు పడి చివరికి రెండు దుప్పట్లుంటే ఇచ్చింది. ఇచ్చాక ఆయన ఏవేనా అనుకుంటాడేమో అనుకుంది.

కూడా బట్టలు తెచ్చుకునే అలవాటు లేనందుకు, తనను తనే తిట్టుకున్నాడు తప్ప దుప్పట్ల

విషయం ఏం అన్లేదు. ఓ దుప్పటీ చుట్టబెట్టుకుని, రెండోది వొంటి నిండా కప్పుకొన్నాడు. తడి బట్టలు దణ్ణంమీద ఓ పక్కగా ఆరేశాడు.

"మీరెలా వుంటున్నారో కానీ వొంటరితనం మాత్రం చాలా భయంకరమైందండీ!" అన్నాడాయన కిటికీలో కూచుంటూ.

తన గురించి తన మనసు చెప్పినట్టనిపించింది ఆమాట సావిత్రికి.

"ఇలా మడత మంచంమీద కూచోండి! స్టౌమీద కొంచెం అన్నం పెట్టివస్తాను," అంది సావిత్రి వంటింటివేపు కదుల్తూ.

"అబ్బే యిప్పుడెందుకండీ యాతన ఏం వద్దులెండీ!" అన్నాడాయన.

"ఇచ్చే ఈ ఒకపూట ఆతిథ్యం పూర్తిగా ఇవ్వనివ్వండి. అయినా నిజం చెప్పండి మీరెప్పుడు భోంచేశారు ఆకలిగా లేదూ—" అంది.

"నిజం చెప్పాల్సొస్తే నిజంగానే చాలా ఆకలిగావుంది. నిన్న సాయంత్రం ఎప్పుడో చేశాను భోజనం." అన్నాడాయన.

"అయితే, ఒక్క నిమిషం వుండండి" అంటూ వంటింట్లోకి నడిచింది సావిత్రి.

సావిత్రి బియ్యం కడిగి స్టౌమీద పెట్టేంత వరకూ ముందు గదిలో అటూ ఇటూ పచార్లు చేస్తూనే వున్నాడాయన. అలా పచార్లు చేస్తూనే గది గుమ్మం దగ్గర్నుంచి, ఒక మనిషి ఇరుగ్గా మసలడానికి సరిపోయేలావున్న ఆ వంటింటిని కూడా చూశాడు.

సావిత్రి తిరిగి ముందు గదిలోకి వచ్చి మరోసారి చెప్పాక మంచంమీద కూచున్నాడాయన. ఎదురుగా కుర్చీవేసుకుని కూచుంది సావిత్రి.

అన్నం వుడుకుతున్నంతసేపూ, వుడికాక భోజనాలు అవుతున్నంతసేపూ ఇద్దరూ చాలా కబుర్లు చెప్పుకున్నారు.

వేడివేడి అన్నం తింటూ అలా కబుర్లు చెపుతూ చాలాసేపు భోంచేసినా, చాలా తొందరగా కడుపు నిండిపోయినట్టనిపించింది సావిత్రికి. చాలా ఏళ్ళ తర్వాత సహజమయిన వాతావరణంలో, మనసులో ఏ ఇరుకూ లేకుండా ఆ రాత్రి గడుస్తున్నట్టనిపిందింది సావిత్రికి.

భోజనాలయిన కాసేపటికి "ఎలాగా ఈ రాత్రికి ఆపేశారు వర్షం అలాగేవుంది. ఓ చాప ఇస్తే బయట వరండాలో తెల్లారేదాకా గడిపేస్తాను" అన్నాడాయన.

"వరండాలో చలండీ అయినా అప్పుడే నిద్రొచ్చేస్తోందా మీకు?" అంది సావిత్రి.

"నిద్రొచ్చేస్తోందని కాదు మీకు నిద్రాభంగం కదా అయినా ఒకసారి పడుకుంటే నన్ను చలిగిలీ ఏం చెయ్యవు ఫరవాలేదు

(వి) చిత్ర విజ్ఞానం



పనామా తూర్పు తీరాన క్యూనా జాతి ఆదిమవాసులు చెరుకుపంట ఆధారంగా జీవిస్తారు. చెరకు రసంతో వాళ్ళు "చిచా" అనబడే మద్యపానం తయారు చేసుకుని పండగలు చేసుకుంటారు. చెరుకునుండి రసం తీయటానికి వారు కనిపెట్టిన పద్ధతి రెండువేల సంవత్సరాల నాటిదని అంటున్నారు. రెండు దూలాలు ఆధారంగా అమర్చబడిన రెండు కర్రలమధ్య చెరకు గడలు పోనిచ్చి రసం తీస్తారు. ఈ రెండుకర్రల్లో పైకర్ర పొడుగుగా వుంటుంది. దీని చివర్న ఒక మనిషి నుంచుని ఎగురుతూ వుంటాడు. పడిపోకుండా వుంటానికి అతని చేతికి ఒక నిలువు కర్ర ఊతగా వుంటుంది. రెండు కర్రలమధ్య చెరకుగడను తోయడానికి మరొక మనిషి వుంటాడు! ఇప్పటి యంత్రం ఈ సాధనం లోనుండి రూపొందించబడిందే!!

లెండీ!" అన్నాడు.

ఆయనింకాసేపు కబుర్లు చెపితే బావుణ్ణని వుంది సావిత్రికి. ఆ విషయం బయటికి చెప్ప లేకపోయింది.

"వుండండి. అయితే పక్కేసి వస్తాను," అంటూ చాప, తలగడా తీసుకొని వీధి తలుపువేపు నడిచింది.

తలుపు తీసీ తీయగానే వర్షం జల్లు ముఖం నిండా పడింది సావిత్రికి. అలాగే తడుస్తూ వరండా మీదికి వొచ్చింది. వర్షం జల్లుకి వరండా అంతా తడిసి తడితడిగా వుంది.

"వరండా అంతా తడిసి పోయింది. మీరలా మడత మంచంమీద పడుకోండి." అంది సావిత్రి లోపలికొచ్చి.

ఆయన వెళ్ళి వరండాఅంతా చూసొచ్చాడు. వచ్చాక సావిత్రినే మంచంమీద పడుకో మన్నాడు .తనే కిటికీ దగ్గరగా పడుకుంటా నన్నాడు. సావిత్రి ఒకటికి రెండుసార్లు చెప్పినా ఆయన వినలేదు.

కాళ్ళు ముడుచుకొని మంచంమీద కూచుని సావిత్రి, గోడవారగా పడుకుని ఆయనా మరి కాసేపు మాట్లాడుకున్నారు.

సావిత్రి చెప్పింది వింటూ ఊఁ కొట్టూ కొడుతూ అలాగే నిద్రపోయాడాయన.

ఆయన పడుకున్నా సావిత్రికి నిద్రపట్టలేదు. జరిగిందంతా తల్చుకుంటుంటే చిత్రంగా తోచింది. ఆయనెవరో, ఎలాంటివాడో తెలియ కుండా వొంటరిగా వున్న తను ఆ రాత్రి ఆయనకు ఆతిధ్యం ఇవ్వటం కొంచెం సాహ సమే అనిపించింది. 'ఆఁ ఇందులో ఏవుంది లెద్దూ' అని తన మనసుకి తనే నచ్చచెప్పుకుని నిద్రపట్టించుకునే ప్రయత్నం చేసింది.

ఓపట్టాన నిద్రపట్టలేదు సావిత్రికి. చాలా సేపటికి నిద్రపట్టినా రాత్రి మధ్యలో చాలాసార్లు మెళకువ వచ్చింది. మెళకువొచ్చి నప్పుడల్లా గోడవారగా పడుకున్న ఆయనవేపు చూసింది. ఓసారి.

అలా చూసినప్పుడే దుప్పటీ చెదిరిపోయి, చలికి చిన్నపిల్లాడిలా ముడుచుకుపోయి పడు కున్న ఆయన కనిపించారు.

లేచి వెళ్ళి దుప్పటీ సరిచేద్దా మనిపించింది సావిత్రికి. మంచంమీంచి లేచి మళ్ళీపడుకుంది. పడుకుని ఆయనవేపు అలాగే చూస్తూంటే ఈయన కూడా కొన్ని వర్షపు రాత్రులు భార్య చేరువలో నిండుగా, వెచ్చగా గడిపిన మనిషే కదా! 'అనిపించింది.'

– ఆ ఆలోచనకి ఒకసారి వులిక్కిపడింది. వెన్ను జలదరించి నట్టనిపిస్తే, దుప్పటీ నిండుగా ముసుగెట్టుకుని పడుకుంది సావిత్రి.

* * *

తెల్లారేక ఆయనకన్నా ముందే లేచింది సావిత్రి. వొళ్ళెరక్కుండా అమాయకంగా నిద్ర పోతూ కన్పించాడు. కాఫీపెట్టి నిద్రలేపింది.

ముఖం కడుక్కుని కాఫీ తాగాడు. దణ్ణెం మీంచి చాలావరకు ఆరిన తన బట్టలు తీసుకుని వేసుకున్నాడు.

వంటింట్లో వుంటే సావిత్రిని పిలిచాడు. సావిత్రి వచ్చాక "ఇంక నేను వస్తానండీ! నా గురించి చాలా శ్రమ తీసుకున్నారు. చాలా థాంక్స్" అన్నాడు.

ఆ మాటలు విన్న సావిత్రి ఆయన ముఖం లోకి తేరిపార చూసింది. నిద్రపోతున్నప్పుడు న్నంత ప్రశాంతంగానూ, తేటగానూ వుంది.

గడిచిన రాత్రి ఆయన ప్రవర్తనంతా గుర్తొ చ్చింది. వర్షపు రాత్రంతా వొంటరిగా వొకే గదిలో తనతో వున్నా ఏ మాత్రం అసభ్యంగా ప్రవర్తించని ఆయన తీరు గుర్తొచ్చింది. ఎంతో దగ్గరగా, ఆత్మీయంగా ఆయన చెప్పిన కబుర్లు గుర్తొచ్చాయి.

సావిత్రి తేరుకునే లోపలే ఆప్యాయంగా సావిత్రివేపు మరోసారి చూసి గుమ్మంవేపు నడిచాడాయన.

ఏమిటో చెయ్యాలని, ఏదేదో చెప్పాలని తబ్బిబ్బు పడింది సావిత్రి మనసు.

అప్పటికే ఆయన వీధిలోకి వెళ్ళిపోయాడు.

ఓ క్షణానికి ఏదో జలపాతం వెనకనుంచి తోస్తున్నట్టు ఒక్కుదుటున వీధిలోకి వొచ్చింది

సావిత్రి. వొచ్చి చెయ్యెత్తి ఏదో అనబోయింది. అప్పటికే ఆయన వీధి మలుపు తిరిగాడు.

కాస్సేపు అలాగే వీధివేపు చూసి నీరసంగా వెనక్కి తిరిగొచ్చి మంచంమీద కూలబడింది. పరుగెత్తు కెడితే ఆయన అంది వుండేవాడు. కానీ అంతసత్తువ తన కాళ్ళకి వున్నట్టనిపించ లేదు సావిత్రికి.

లోలోపలనుంచి సుళ్ళు తిరుగుతూ ఏడుపు రాబోయింది. ఏడుపు నాపుకొంటూ, 'ఏమో ఇల్లు తెలుసుగా ఆయనే తిరిగి రావొచ్చు!! అనుకొంది కొద్దిగా ఆశపడుతూ. అయినా లోలోపల్నుంచి పొర్లి వొస్తున్న ఏడుపు ఆగలేదు.

'సగటు ఆడ మనసు ఇరుకునించి, అన వసరపు పిరికి తనం నుంచి సావిత్రి ఓ అడుగు ముందు కొచ్చుంటే ఎంత బావుణ్ణు!' అను కుంది ఆ గదిలోని వొంటరి తనం తిరిగి సావిత్రి చుట్టూ చేరుతూ. □

★ నవ్వులజల్లు ★

"ఆ కారు అక్కడెందుకు నిలబడిందో తెలుసా?"

"తెలియదు—ఎందుకు?"

"అది కూర్చోవడం నేర్చుకోలేదు."

* * *

పిచ్చి ఆసుపత్రిలో డాక్టర్ పిచ్చివాళ్ళని 'కుడికాలు' తర్వాత 'ఎడమకాలు' అని గెంత మన్నాడు, సైకిల్ పెడల్ తొక్కినట్టు. అందరూ గెంతుతూవుంటే ఒకడు రక్‌మని ఆపాడు. డాక్టరు కారణం అడిగితే వాడు, "నా సైకిలు ప్రస్తుతం కొండమీంచి కిందికి స్లోపులో దిగుతోంది, అంచేత పెడల్ తొక్కనక్కర్లేదు" అన్నాడు.

* * *

పరిగెత్తుకొని పోలీస్‌స్టేషనొచ్చిన యువకుడు, ఇన్‌స్పెక్టరుగారూ, నన్ను అర్జెంటుగా ఖైదు చెయ్యండి, పూలగోలెంతో నా భార్య తలమీద విసిరి . . "

"చంపేశారా?"

"లేదు, గురి తప్పింది! అందుకే పరిగెత్తుకొస్తున్నా "

* * *

పోలీసు :—కనిపించకపోయిన మీ భార్యని కనిపెట్టేశాము !"

అతడు :—అది ఏం చెప్పింది ?"

పోలీసు :—"ఏమీ చెప్పలేదే "

అతడు :—"అయితే నా భార్యకాదు!"

* * *

ఇన్‌స్పెక్టర్ :—"పెళ్ళయిన పది సంవత్సరాలుగా మీ భార్య చేతి కందిన వస్తువులను మీ మీద గిరాటేస్తోంది కదా, మరి ఇన్నాళ్ళ తర్వాత కంప్లెయింటు యిస్తారెందుకు?"

అతడు :—"గురి తప్పకుండా విసరడం నిన్నటినుంచే దానికి సాధ్యమైది ...అందుకే."

* * *

"నా భార్యని చూసి భయపడి నడిచేవాణ్ణి కాను!"

"మరి . "

"పరిగెత్తేవాడ్ని!"

సేకరణ : ఆర్. శివరాజన్